9 జిల్లాలకు రెడ్ అలర్ట్



వరదనీటిలో చిక్కుకున్న వారిని పడవలో తరలిస్తున్న దృశ్యం

- నేడు చెన్నై సహా 4 జిల్లాలకు సెలవు ప్రకటించిన ప్రభుత్వం
- న్యాయస్థానాలూ పని చేయవు
- పుదువై, కారైక్కాల్‌లో విద్యాలయాలకు సెలవు



వర్షపు నీటితో నిండిన పెరంబూరు సబ్‌వే

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల ఆగమనం, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం తొమ్మిది జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ కేంద్రం ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. సోమవారం అర్ధరాత్రి నుంచి చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురిశాయి. దీంతో ఆ నాలుగు జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. చెరువులు, జలాశయాల్లో నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో మంగళవారం చెన్నై సహా నాలుగు జిల్లాలకే పరిమితమైన రెడ్ అలర్ట్ మరో ఐదు జిల్లాలకు కూడా ప్రకటించడంతో ఆయా జిల్లాల ప్రజలంతా ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పవాయుపీడనం వాయుగుండంగా మారనుండటంతో చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు, రాణిపేట, తిరువణ్ణామలై, వేలూరు, కడలూరు, విల్లుపురం జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ జిల్లాల్లో బుధవారం ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కుండపోత వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సముద్ర తీర ప్రాంతాల్లో గంటలకు 40 నుంచి 50 కి.మీల వేగంతో పెనుగాలులు వీస్తాయని ఈ నెల 18 వరకూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని, జాలర్లు చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉత్తర సముద్రతీర జిల్లాల్లోనూ పెనుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని అధికారులు పేర్కొన్నారు. మన్నార్ జలసంధి, కన్నియాకుమారి సముద్రతీరంలో గంటకు 35 నుండి 45 కి.మీ.ల వేగంతో పెనుగాలులు వీస్తాయని వివరించారు.

చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలకు వరద ముప్పు పొంచివుందని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో ఆయా జిల్లాల్లో ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అయితే అత్యవసర సేవలందించే పోలీసు, అగ్నిమాపక, స్థానిక సంస్థలు, డైరీ తదితర శాఖలు, మెట్రో వాటర్ బోర్డు, ఆస్పత్రులు, మెడికల్ షాపులు, బ్యాంక్‌లు, విద్యుత్, ఎంటీసీ, చెన్నై మెట్రోరైల్, ఎమ్మార్టీఎస్ రైల్వే, విమానాశ్రయం, పెట్రోల్ బంక్‌లు, హోటళ్లు, వరద సహాయక చర్యల్లో పాల్గొనే శాఖలు యధావిధిగా పనిచేయనున్నాయి. కాగా హైకోర్టుతో పాటు పైన పేర్కొన్న నాలుగు జిల్లాల్లోని న్యాయస్థానాలకూ సెలవు ప్రకటించారు. ఇదిలా వుండగా బుధవారం కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి, కారైక్కల్‌లలోని విద్యాలయాలకు అక్కడి ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

పెరంబూరులో 16.5 సెం.మీ.ల వర్షపాతం

నగరంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు భారీ వర్షాలు కురిశాయి. పెరంబూరు ప్రాంతంలో 16.5 సెం.మీల. వర్షపాతం నమోదైంది. కొళత్తూరులో 15.8 సెం.మీ., అన్నానగర్‌లో 15.2 సెం.మీ., అంబత్తూరు 13. సెం.మీ, బేసిన్‌బ్రిడ్జి 12.2 సెం.మీ, వేళచ్చేరి 12.2 సెం.మీ, మధురవాయల్, వడపళని, తండయార్‌పేటలో 10 సెం.మీల. చొప్పున వర్షపాతం నమోదైనట్లు స్థానిక వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు.

డెల్టాలో నీటమునిగిన 6500 ఎకరాలు

రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు డెల్టా జిల్లాలో 6500 ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి నీట మునిగింది. తంజావూరు, నాగపట్టినం, తిరువారూరు, మైలాడుదురై, పుదుకోట, తిరుచ్చి, కరూరు, అరియలూరు, పెరంబలూరు జిల్లాలో సోమవారం మధ్యాహ్నం నుండే చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం సాయంత్రానికి తీవ్ర రూపం దాల్చింది. కుండపోతగా కురిసిన ప్రాంతాలకు జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

కంచిలో నిండిన చెరువులు..

రెండు రోజులపాటు కురిసిన వర్షాలకు కాంచీపురం జిల్లాలోని ప్రధాన చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఆ జిల్లాలోని అనుమన్ తండలం, ఇలనగర్ చిత్తేరి, నందివరం, తిమ్మావరం, మధురాంతకం, అచ్చరపాకం చెరువు సహా మొత్తం 20 చెరువుల్లో నీటిమట్టం వేగంగా పెరిగింది. ఇదే విధంగా చెంబరంబాక్కం జలాశయంలోనూ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. మంగళవారం మధ్యాహ్నం కాంచీపురం జిల్లా కలెక్టర్ కళైసెల్విమోహన్ జలశయాన్ని నీటివనరుల శాఖ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. బుధవారం మధ్యాహ్నం అల్పపీడనం వాయుగుండంగా మారుతుందని, దాని ప్రభావంతో మరి నాలుగైదు రోజుల వరకు ఉత్తరాది జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. చెన్నై సబర్బన్ ప్రాంతాల్లో మరో రెండు రోజులు భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన వివరించారు.

ఈశాన్య రుతుపవనాలు ప్రారంభం..

రాష్ట్రంలో మంగళవారం ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయని, అవి వస్తూ భారీ వర్షాలను వెంట తీసుకువచ్చాయని చెన్నై వాతావరణ కేంద్రం దక్షిణ మండల అధికారి బాలచంద్రన్ ప్రకటించారు. ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి తోడు బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బుధవారంలోగా వాయుగుండంగా మారనుండటంతో తొమ్మిది జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించారు.



ఎలిఫెంట్ గేట్ కాల్వలో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి



పారిశుధ్య కార్మికులకు టీ, బిస్కెట్లు ఇచ్చి మాట్లాడుతున్న స్టాలిన్

వర్షబాధిత ప్రాంతాల్లో సీఎం పరిశీలన

సమస్యలు తెలుసుకుంటూ.. పనులు పురమాయిస్తూ.. స్వయంగా అధికారులతో సమీక్షించిన స్టాలిన్

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కుండపోత వర్షం కారణంగా నగరం జలమయం కావడంతో ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయంగా సహాయ కార్యక్రమాలను పరిశీలించారు. అధికారులు, సీనియర్ మంత్రులతో కలిసి వర్ష ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం ఉదయం పర్యటించి, ఆయా ప్రాంతాల్లో వాననీటి తొలగింపు పనులను పరిశీలించారు. తొలుత ఉత్తరచెన్నై ప్రాంతానికి వెళ్ళి అక్కడి ఎలిఫెంట్‌గేట్ ప్రాంతంలో రహదారులలోని వర్షపు నీటిని మోటారు పంపులతో తొలగిస్తుండటాన్ని పరిశీలించారు. ఎలిఫెంట్ గేట్ ఫ్లైఓవర్ దిగువనున్న కాల్వలో పూడిక తీత పనులను తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలోని సహాయక చర్యలు గురించి మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు ముఖ్యమంత్రికి వివరించారు. ఆ తర్వాత పులియంతోపు ప్రాంతానికి వెళ్ళిన స్టాలిన్ అక్కడ జరుగుతున్న కాల్వ మరమ్మతు పనులను పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న కార్పొరేషన్ కార్మికులు, ఉద్యోగుల వద్ద ఏయే పనులు జరుగుతున్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి తిరువికనగర్, విల్లివాక్కం ప్రాంతాలలోనూ ఆయన తనిఖీ చేశారు. స్టాలిన్ వెంట మేయర్ ఆర్.ప్రియ, అధికారులు పర్యటించారు.

క్షేత్ర కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా: స్టాలిన్

వరదలు, వర్షబీభత్సం సంభవించినప్పుడల్లా పారిశుధ్యకార్మికుల సేవలు మరువలేమని, ఇలా ఆయా ప్రాంతాల్లో రేయింబవళ్లు పనిచేసే ఆ కార్మికులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ముఖ్యమంత్రి స్టాలిన్ భరోసా ఇచ్చారు. మంగళవారం ఉదయం పులియాంతోపులో వర్షబాధిత ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను కలుసుకున్నారు. అందరినీ తన వెంటబెట్టుకుని ఆ ప్రాంతంలో ఉన్న టీషాపుకు తీసుకెళ్ళారు. అందరికీ టీ, బిస్కెట్లను స్టాలిన్ అందజేశారు. అక్కడి బల్లపై కూర్చుని వారితో మాట్లాడుతూ తానూ టీ తాగారు. ఈ సందర్భంగా కార్మికులు ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.



టి.నగర్ బర్కిట్‌రోడ్డులో కూలిన వృక్షాన్ని తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చెన్నైలో కుండపోత

- నదుల్లా వీధులు.. చెరువుల్లా వాడలు
- స్తంభించిన జనజీవనం
- మూతబడిన కార్యాలయాలు, విద్యాలయాలు

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆకాశానికి చిల్లిపడిందా? వరుణుడు విరామం మరిచాడా?.. అన్నట్లుగా చెన్నైలో కుండపోత వర్షం కురిసింది. సోమవారం రాత్రి ప్రారంభమైన వర్షం మంగళవారం రాత్రి వరకు పడుతూనే వుండడంతో నగరం జలసంద్రంగా తయారైంది. వీధులన్నీ నదుల్లా, వాడలన్నీ చెరువుల్లా తయారయ్యాయి. దీంతో చెన్నైలో జనజీవనం స్తంభించింది. పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాలయాలు మూతబడ్డాయి.

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా రాజధాని నగరం చెన్నై సహా నాలుగు జిల్లాలోనూ సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మంగళవారం ఉదయం మరింత తీవ్ర రూపం దాల్చటంతో నాలుగు జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. మంగళవారం ఉదయం నుంచి కుండపోత వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం నుండే చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో చల్లటి గాలులతో వాన జల్లులు ప్రారంభమయ్యాయి. సౌత్ చెన్నై, సెంట్రల్ చెన్నై, నార్త్ చెన్నై తదితర ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిశాయి. ముఖ్యంగా మెట్రోరైలు మార్గం పనులు జరుగుతున్న ప్రాంతాల్లో పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ఆ ప్రాంతాల్లో వర్షపునీరంతా వరదలా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోయంబేడు మెట్రో ఫ్లైఓవర్ దిగువ పూందమల్లి రహదారి వైపు వర్షపు నీరు వరదలా ప్రవహించడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాలు, ప్యారీస్ కార్నర్ వైపు వెళ్లే వాహనాలు నత్తనడక నడిచాయి. పురుషవాక్కం రిథర్డ్ రోడ్డులో వర్షపు నీరు పొంగి ప్రవహించింది. అయనావరం నూర్‌హోటల్ బస్టాపు నుంచి సిగ్నల్ వరకు సుమారు వంద మీటర్ల వరకు అడుగుమేర వర్షపు నీరు ప్రవహించడంతో వాహనాలన్నీ నత్తనడక నడిచాయి. అయనావరం ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద వర్షపునీరు వెళ్లేందుకు సరైన మార్గం లేక ఆ ప్రాంతం చెరువును తలపించింది. పురుషవాక్కం పాత మోక్షం థియేటర్ వద్ద వాననీటితో మురుగునీరు కూడా కలవటంతో దుర్వాసన వెదజల్లింది. దీంతో పాదచారులు కూడా ఆ మార్గంలో నడిచి వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. దాస్ ప్రకాష్ బస్‌స్టాపు వద్ద రహదారిపూర్తిగా కనిపించనంతగా వర్షపు నీరు పొంగి ప్రవహించింది. అన్నానగర్ అన్నా ఆర్చ్ వద్ద ప్రభుత్వ సిద్ధ వైద్య ఆసుపత్రి ప్రవేశ ద్వారం వద్ద అడుగులోతున వర్షపునీరు ప్రవహించింది.

టి.నగర్‌లో..

నగరానికి వాణిజ్యకేంద్రమైన టి.నగర్‌లోనూ రహదారులన్నీ జలమయమయ్యాయి. అక్కడి రాష్ట్ర చలనచిత్ర కార్మిక సంఘం భవన ప్రాంతం, టి.నగర్ బస్‌స్టేషన్ చుట్టూ మోకాలిలోతున వర్షపు నీరు ప్రవహించింది. పెరియమేడు, వేప్పేరి, కీల్పాక్, ఆమ్స్‌రోడ్డు, మైలాపూరు, కోట్టూరుపురం, అన్నాసాలై, థౌజెండ్‌లైట్స్, ట్రిప్లికేన్, ఐస్‌హౌస్ తదితర ప్రాంతాల్లో రహదారుల్లో వర్షపునీటిలో సుమారు వందకు పైగా బైకులు, స్కూటర్లు సైలెన్సర్లలో నీరు చేరి కదలకుండా మొరాయించాయి. నగరంలోని యాభైకి పైగా ప్రధాన రహదారులలో చెరువును తలపించేవిధంగా వర్షపు నీరు వరదలా ప్రవహించాయి.

కూలిన చెట్లు...

నగరంలో మంగళవారం వేకువజామున పెనుగాలులకు నగరంలో మూడు ప్రాంతాల్లో చెట్లు కూలిపడ్డాయి. టినగర్ బర్కిట్‌రోడ్డులో ఓ పెద్ద వృక్షం కూలిపడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం వెళ్ళి ఆ వృక్షాన్ని కోసి తొలగించారు. చూళైమేడు నెల్సన్ మాణిక్యం రోడ్డు, నుంగంబాక్కం వీరభద్రన్ వీధిలోనూ చెట్లు కూలిపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది, విపత్తుల నిర్వహణ బృందం, పోలీసులు అక్కడికి వెళ్ళి చెట్లను కోసి తొలగించారు.

సబ్‌వేలలో...

నగరంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలకు పలు సబ్‌వేలలోనూ వర్షపు నీరంతా పొంగి ప్రవహించింది. ఆ మార్గంలో వెళ్లాల్సిన వాహనాలను మళ్ళించారు. ఇక నగరంలో 20కి పైగా సబ్‌వేలలో చేరిన వర్షపునీటిని భారీ మోటార్ల ద్వారా తొలగించారు. ఇదే విధంగా తాంబరం, ఆవడి పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాలన్నీ దీవుల్లా మారాయి. ఆ ప్రాంతాలలో నివసిస్తున్నవారిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



అన్నా వర్సిటీలో కలాం విగ్రహానికి నేతల నివాళి



రాజ్‌భవన్‌లో కలాం చిత్రపటానికి పుష్పమాల వేసి నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

కలాంకు ఘననివాళి

- రామేశ్వరంలో కలాం స్మారక స్థలం వద్ద ప్రత్యేక ప్రార్థనలు

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా రామేశ్వరంలోని ఆయన స్మారక మందిరం వద్ద మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా అబ్దుల్ కలాం 93వ జయంతి వేడుకలు నిర్వహించారు. రామేశ్వరం పేకరుంబులోని కలాం జాతీయ స్మారక ప్రాంగణాన్ని అలంకరించారు. కలాం మేనల్లుడు జైనులాబుద్దీన్, కుమార్తె నసీమా మరక్కాయర్, మనవళ్లు షేక్ సలీం, అవుల్‌మీరా, కుటుంబ సభ్యులు కలాం స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కలాం స్నేహితులు, ప్రజలు పాల్గొన్నారు.



కలాం సమాధి వద్ద కుటుంబసభ్యులు, స్నేహితుల నివాళి

కలాం యువతకు ఆదర్శం: సీఎం స్టాలిన్

దివంగత రాష్ట్రపతి డా.ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ తన ఎక్స్ పేజీలో... విద్య మనసులో ఒక కల, దానిని సాకారం చేసుకోవడానికి కృషిచేస్తేనే ఎదుగుదల మనల్ని వెతుక్కుంటూ వస్తుంది. మేం అధికారం చేపట్టిన తర్వాత అబ్దుల్ కలాం చదువుకున్న, బోధించిన అన్నా విశ్వవిద్యాలయంలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని గత ఏడాది ప్రకటించాం. శాస్త్రీయ వికాసం, మానవీయ శాస్త్రాలు, విద్యార్థుల సంక్షేమం కోసం పాటుపడే తమిళులకు ప్రతి ఏడాది 'డా.ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు' ప్రదానం చేస్తున్నాము. మన ద్రావిడ మోడల్ ప్రభుత్వం మన యువత కలలను సాకారం చేసేందుకు 'నాన్ ముదల్వన్' సహా పలు కార్యక్రమాలు అమలుచేస్తోంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో యువత రాణించి ఆయన గౌరవం చేకూర్చాలి అంటూ సీఎం స్టాలిన్ నివాళులర్పించారు.

ప్రత్యేక మారథాన్...

ప్రభుత్వ తరఫున రామనాథపురం జిల్లా కలెక్టర్ సిమ్రన్‌జిత్ సింగ్, డిప్యూటీ కలెక్టర్ (శిక్షణ) మహమ్మద్ ఇర్ఫాన్, పలు శాఖల అధికారులు కలాం స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించారు. అలాగే, రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, పర్యాటకులు, ప్రజలు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా కలాంకు నివాళులర్పించారు. కలాం జయంతి సందర్భంగా జిల్లా యంత్రాంగం తరఫున నిర్వహించిన మారథాన్‌లో క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న వారికందరికి సర్టిఫికేట్లు అందజేశారు. ఇదిలా వుండగా కలాం జయంతిని పురస్కరించుకుని గిండి అన్నా విశ్వవిద్యాలయంలో కలాం విగ్రహానికి రాష్ట్ర తమిళాభివృద్ధి, సమాచారశాఖ మంత్రి ఎంపీ స్వామినాథన్, ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ గోవి చెలియన్, పార్లమెంటు సభ్యురాలుతమిళచ్చి తంగపాండ్యన్ తదితరులు మంగళవారం పుష్పమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా రాజ్‌భవన్‌లో కలాం చిత్రపటానికి రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి పుష్పమాల వేసి నివాళులర్పించారు.

నగరం నుంచి 8 విమానాల రద్దు

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి బయల్దేరాల్సిన 8 విమానాలు రద్దయ్యాయి. అల్పపీడనం కారణంగా నగరంలో మూడు రోజులు భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో, తగినంత మంది ప్రయాణికులు లేకపోవడంతో మంగళవారం బెంగళూరు, అండమాన్, ఢిల్లీ, మస్కట్ తదితర నగరాలకు వెళ్లే 8 విమానాలు రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు.

ఒకరోజు ముందుగా సెలవు ప్రకటించాలి

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించే నిర్ణయం ఆయా జిల్లా కలెక్టర్లదేనని, వాతావరణ పరిస్థితులు పరిశీలించి ఒకరోజు ముందుగానే సెలవు ప్రకటించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ప్రకటనలో... వర్షాల కారణంగా విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు, సెలవుల సమయంలో విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించరాదని విద్యాశాఖ తెలియజేసింది.

రైళ్ల సమాచారానికి ప్రత్యేక నెంబర్లు

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి బయల్దేరే రైళ్ల వివరాలు తెలుసుకొనేలా దక్షిణ రైల్వే ప్రత్యేక నెంబర్లు పరిచయం చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారి చెన్నై-నెల్లూరు మధ్య తీరం దాటనుందని, ఈ ప్రభావంతో చెన్నై, చెంగల్పట్టు సహా 9 జిల్లాలకు బుధవారం రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి పొరుగు రాష్ట్రాలు, ఇతర నగరాలకు వెళ్లే రైళ్ల వివరాలు తెలుసుకొనేందుకు ప్రజలు 044-25330952, 044-25330953 అనే నెంబర్లు సంప్రదించవచ్చని దక్షిణ రైల్వే తెలియజేసింది.

సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూలు వాయిదా

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఈ నెల 15 నుంచి 18వ తేది వరకు నిర్వహించాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూ భారీ వర్షాల కారణంగా వాయిదాపడింది. ఈ మేరకు ఈ విభాగం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై కార్పొరేషన్, మున్సిపాలిటీలు, తమిళనాడు తాగునీరు, డ్రైనేజీ బోర్డు, చెన్నై మెట్రోపాలిటన్‌లోని 2,576 పోస్టుల భర్తీకి ఈ నెల 15,16,17 తేదీల్లో జరగాల్సిన ఇంటర్వ్యూలు, 18న జరగాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన వాయిదావేశామని, తుపరి తేదీలను త్వరలో ప్రకటిస్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది.

18 వరకు కలైంజర్ సెంటినరీ పార్క్ మూసివేత

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కెథడ్రల్ రోడ్డులోని కలైంజర్ సెంటినరీ పార్క్ ఈ నెల 18వ తేది వరకు మూసివేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. నగరానికి మంగళవారం నుంచి మూడు రోజులు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో, కలైంజర్ సెంటినరీ పార్క్‌ను మంగళవారం నుంచి 18వ తేది వరకు మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటనలో తెలిపింది.

19న రేషన్ గ్రీవెన్స్

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 19వ తేది రేషన్ గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ప్రజా పంపిణీ పథకంలో వినియోగదారుల సమస్యలు పరిష్కరించేలా ప్రతి మండల పరిధిలో ప్రతినెలా రేషన్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. ఆ ప్రకారం, నగరంలోని ఆహార సరఫరా, వినియోగదారుల భద్రత శాఖకు చెందిన 19 మండల అసిస్టెంట్ కార్యాలయాల్లో 19వ తేది ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిబిరాలు నిర్వహించనున్నారు.

కుమరి ఈస్ట్ శాఖ ఇన్‌ఛార్జిగా జాన్‌తంగం



చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి ఈస్ట్ జిల్లా పార్టీ ఇన్‌ఛార్జిగా జాన్‌తంగంను నియమిస్తూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇదివరకు ఈ పదవిలో ఉన్న మాజీ మంత్రి దళవాయి సుందరం ఈ నెల 6న కన్నియాకుమారిలో ఆర్ఎస్ఎస్ ర్యాలీని ప్రారంభించి విమర్శలకు గురై పదవులను కోల్పోయిన విషయం తెలిసిందే. అతడికి బదులుగా పార్టీ సీనియర్ నాయకుడు జాన్‌తంగంను ఆ పదవిలో నియమించినట్లు ఈపీఎస్ పేర్కొన్నారు.

చెన్నై వైపే తీరం దాటనున్న వాయుగుండం

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం బుధవారం మధ్యాహ్నంలోగా వాయుగుండంగా మారి చెన్నై నగరం వైపే తీరం దాటే అవకాశం ఉందని స్థానిక వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. ఈ వాయుగుండం రెండు రోజుల్లో వాయవ్యదిశగా రాష్ట్రంలోని ఉత్తరాది జిల్లాలు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ సముద్రతీరం, పుదుచ్చేరి వైపు దూసుకువచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఈ వాయుగుండం గురువారం వేకువజామున తీరం దాటుతుందన్నారు.

జలాశయాలకు పెరిగిన ఇన్‌ఫ్లో



పుళల్ జలాశయం

పెరంబూర్, అక్టోబరు 15: తిరువళ్లూర్ జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా నగరానికి తాగునీరందించే జలాశయాల్లో నీటి మట్టం పెరిగింది. చెన్నై, తిరువళ్లూర్ సహా పలు జిల్లాల్లో సోమవారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. తిరువళ్లూర్ జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు సరాసరిన 4 సెం.మీ వర్షపాతం నమోదైంది. తిరువళ్లూర్ జిల్లాతో పాటు కాంచీపురం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు నగరానికి తాగునీరందించే జలాశయాలకు నీటి రాక పెరిగింది. మంగళవారం ఉదయం గణాంకాల ప్రకారం, పుళల్ జలాశయానికి 257 ఘనపుటడుగులు, పూండికి 240 ఘనపుటడుగులు, చోళవరంకు 160 ఘనపుటడుగులు, కన్నన్‌కోట-తేర్వాయ్ కండిగైకు 60 ఘనపుటడుగులు, చెంబరంబాక్కం జలాశయానికి 45 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోంది. 11,757 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన ఈ ఐదు జలాశయాల్లో ప్రస్తుతం 3,971 మిలియన్ ఘనపుటడుగుల నీటినిల్వలున్నాయని అధికారులు తెలిపారు.

మేట్టూరు జలాశయానికి పెరిగిన ఇన్‌ఫ్లో

కావేరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మేట్టూరు జలాశయంలో నీటి మట్టం పెరిగింది. సోమవారం సాయంత్రం 6,445 ఘనపుటడుగులున్న నీరు, మంగళవారం ఉదయం 17,596 ఘనపుటడుగులకు పెరిగింది. డెల్టా జిల్లాల సాగు కోసం విడుదల చేస్తున్న నీటిని 3,000 ఘనపుటడుగులకు తగ్గించారు. ప్రస్తుతం జలాశయంలో 89.92 అడుగులు (52.55 టీఎంసీలు) నీటి నిల్వలున్నాయని అధికారులు తెలిపారు.

భారీవర్షాలపై 249 ఫిర్యాదులు

● రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన

వేళచ్చేరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాలకు సంబంధించి కంట్రోల్ రూమ్‌కు 249 ఫిర్యాదులందగా 215 ఫిర్యాదులు పరిష్కరించామని, నగరంలో 300 సహాయక కేంద్రాలు సహా రాష్ట్రవ్యాప్తంగా 5147 కేంద్రాలు ఏర్పాటుచేసామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ విషయమై సచివాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... ఈ నెల 1 నుంచి 14వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా 10.52 సెం.మీ వర్షపాతం నమోదైందని, ఆ ప్రకారం, సాధారణ కన్నా 68 శాతం అధిక వర్షమని తెలిపింది. నామక్కల్ జిల్లాలో సహాయ కేంద్రం ప్రారంభించి 32 మందిని తరలించడంతో పాటు బాధిత ప్రాంతాల్లో 96 మందికి ఆహారం ప్యాకెట్లు అందజేశామన్నారు. వాతావరణ కేంద్రం ప్రకటన మేరకు బుధవారం తిరువళ్లూర్, చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు, విల్లుపురం, మైలాడుదురై, నాగపట్టణం, తిరువారూర్, రాణిపేట, తిరువణ్ణామలై, కళ్లకుర్చి, పెరంబలూరు, అరియలూరు, తంజావూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, తిరుపత్తూర్, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, తిరుచ్చి, పుదుకోట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. అలాగే, 17న తిరువళ్లూర్, రాణిపేట, వేలూరు, తిరుపత్తూర్, కృష్ణగిరి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, చెన్నై, కాంచీపురం, తిరువణ్ణామలై, ధర్మపురి, సేలం, ఈరోడ్ జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని ప్రకటించిందన్నారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సిబ్బందితో 16 బృందాలు, జాతీయ విపత్తు నిర్వహణకు చెందిన 10 బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయన్నారు. చెన్నైలో 89 పడవలను ముంపు ప్రాంతాలకు తరలించామని ప్రభుత్వం తెలియజేసింది.

శ్రీలంక నుంచి తిరిగొచ్చిన జాలర్లు

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్ల నుంచి విడుదలైన రాష్ట్ర జాలర్లు 51 మంది సోమవారం అర్ధరాత్రి కొలంబో నుంచి విమానం ద్వారా మీనంబాక్కం విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి మత్స్యశాఖ అధికారులు స్వాగతం పలికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన వాహనాల్లో వారి వారి స్వగ్రామాలకు తరలించారు. రామేశ్వరం ప్రాంతానికి చెందిన 51 మంది జాలర్లు గత నెల 25వ తేది చేపల వేటకు వెళ్లారు. సముద్రంలో చేపలు పడుతున్న జాలర్లను చుట్టుముట్టిన శ్రీలంక నావికాదళం, సరిహద్దులు దాటారంటూ అరెస్ట్ చేసి, పడవలు స్వాధీనం చేసుకుంది. అనంతరం 51 మంది జాలర్లను కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. ఈ విషయమై శ్రీలంకలోని భారత దౌత్యాధికారులు ఆ దేశ అధికారులతో జరిపిన చర్చలు ఫలించాయి. 51 మంది జాలర్లను ఆ దేశ న్యాయస్థానం విడుదల చేసింది. జైళ్ల నుంచి విడుదలైన జాలర్లను భారత దౌత్యాధికారి కార్యాలయానికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎమర్జెన్సీ సర్టిఫికెట్లతో పాటు 51 మంది జాలర్ల విమాన టిక్కెట్లు కూడా భారత దౌత్యాధికారులు ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో, శ్రీలంక రాజధాని కొలంబో నుంచి 21 మంది జాలర్లు ఎయిర్ ఇండియా విమానంలో నగరానికి చేరుకున్నారు. జాలర్లను స్వాగతించిన మత్స్యశాఖ అధికారులు, వారిని స్వగ్రామాలకు పంపించారు.

స్కూటర్ డెలివరీలో జాప్యం

● పరిహారం చెల్లించాలంటూ ఉత్తర్వులు

వేళచ్చేరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోవై నంజుండాపురం ప్రాంతానికి చెందిన ఫైరోస్‌రాజన్, ఓలా సంస్థకు చెందిన విద్యుత్ స్కూటర్ కొనుగోలుకు 2023 సెప్టెంబరు 1వ తేది ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకున్నాడు. స్కూటర్ ధర రూ.1.67 లక్షలు, ఇన్స్యూరెన్స్ మొత్తం రూ.6,199 పంపించాడు. రెండు నెలలు గడిచినా స్కూటర్ డెలివరీ చేయకపోవడంతో, మనస్తాపం చెందిన ఫైరోస్ రాజన్, బుకింగ్ రద్దు చేసి తాను చెల్లించిన నగదు తిరిగి ఇవ్వాలని నోటీసు పంపించాడు. ఈ విషయమై సంస్థ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో, కోవై వినియోగదారుల ఫోరంలో పిటిషన్ వేశాడు. ఈ విచారించిన ఫోరం అధ్యక్షుడు తంగవేలు, సభ్యులు జారీచేసిన ఉత్తర్వుల్లో... ఓలా సంస్థ తన సేవలు సక్రమంగా చేయలేదని, అందువల్ల స్కూటర్ కోసం పిటిషనర్ చెల్లించిన రూ.1.67 లక్షలు, ఇన్స్యూరెన్స్ రుసుము రూ.6,199కు 9 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాలని, మానసికక్షోభకు పరిహారం రూ.10,000, కేసు ఖర్చులకు రూ.5,000 చెల్లించాలని ఉత్తర్వులు జారీచేశారు.

డీఎండీకే కార్యాలయాన్ని ప్రజలు వినియోగించుకోవచ్చు : ప్రేమలత

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో బాధపడే ప్రజలకు బస, ఆహారాన్ని తమ కార్యాలయంలో అందజేయనున్నట్లు డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత తెలిపారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై సహా పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపిందన్నారు. ఆ ప్రకారం, నగరంలో సోమవారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షాలకు రోడ్లపై వరద నీరు ప్రవహించడంతో పాటు పలు ప్రాంతాలు జలమయమయ్యాయని తెలిపారు. వరదలో చిక్కుకునే ప్రజలు కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బస చేయవచ్చని, వారికి ఆహారం కూడా అందించనున్నామని తెలిపారు. మంత్రులు, అధికారులు సమన్వయంతో పనిచేసి వర్షాల నుంచి ప్రజలను రక్షించేలా చర్యలు చేపట్టాలని ప్రేమలత విజ్ఞప్తి చేశారు.

విద్యుదాఘాతానికి రెండు ఏనుగుల మృతి



మృతిచెందిన ఏనుగులు

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆనైమలై పులుల శరణాయం, పొల్లాచ్చి అటవీ రేంజ్ పరిధిలోని పరుత్తియార్ సమీపంలో వేట నిరోధక విభాగం పోలీసులు గస్తీ చేపట్టారు. రిజర్వ్ ఫారెస్ట్ నుంచి కి.మీ దూరంలో ప్రైవేటు భూమిలో రెండు ఏనుగులు మృతి చెంది ఉండడం గమనించారు. విచారణలో... వ్యవసాయ బావికి వెళ్లే విద్యుత్ వైరు తెగడంతో, ఏనుగులు ఆ తీగకు తగిలి మృతిచెందినట్లు తెలిసింది. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు.

ఈసీఆర్‌లో రేస్ : 15 బైక్‌ల స్వాధీనం

వేళచ్చేరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈసీఆర్ రోడ్డులో రేసింగ్‌కు పాల్పడిన 15 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కానత్తూర్ పోలీసులు ఈసీఆర్ రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కానత్తూర్-ముట్టుకాడు రహదారిపై రేస్ నిర్వహించిన 15 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ బైక్‌లు రూ.2 లక్షల నుంచి రూ.19 లక్షల ధర ఉంటాయి. ఉన్నతాధికారుల సూచనలతో రేస్‌కు పాల్పడిన వారిని పోలీసులు హెచ్చరించి, స్టేషన్ బెయిల్‌తో విడుదల చేశారు.

వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు

● కార్యకర్తలకు సెల్వపెరుందగై పిలుపు

ప్యారీస్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు అవసరమైన సహాయాలు అందించాలని కాంగ్రెస్ కార్యకర్తలకు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... వాయుగుండం ప్రభావంతో చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు సహా 31 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించిందన్నారు. ముఖ్యంగా, రాజధాని నగరం చెన్నైలో ఈ నెల 17వ తేది వరకు అతి భారీవర్షాలు కురుస్తాయని తెలిపిందన్నారు. జలమయ్యే ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఆహారం, తాగునీరు నిత్యావసర సరుకులు అందిండంతో పాటు జలదిగ్బంధంలో చిక్కుకున్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేలా పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని సెల్వ పెరుందగై పిలుపునిచ్చారు.

ఉమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారానికి కనిమొళి

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ (ఎన్‌సీపీ) నేత ఉమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి డీఎంకే తరఫున ఆ పార్టీ ఎంపీ కనిమొళి పాల్గొననున్నారు. ఈ మేరకు ఆ పార్టీ మంగళవారం మధ్యాహ్నం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారానికి రావాలని ఎన్‌సీపీ నేత ఫరూక్ అబ్దులా ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఫోన్ చేసి ఆహ్వానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాలు కురుస్తుండడంతో ఉమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారంలో పాల్గొనలేనని, డీఎంకే తరఫున ఎంపీ కనిమొళి హాజరవుతారని స్టాలిన్ తెలిపారు.

తిరుచెందూర్‌లో వందడుగులు వెనక్కు వెళ్లిన సముద్రం



తిరుచెందూర్‌లో వెనక్కి వెళ్లిన సముద్రం

పెరంబూర్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయం, అయ్యా వైకుంఠ అవతార్ మధ్య సముద్ర ప్రాంతంలో ప్రతి నెలా అమావాస్య, పౌర్ణమి రోజులు ప్రారంభం, తర్వాత రోజు సముద్రం వెనక్కి వెళ్తోంది. సాయంత్రం యథాస్థితికి చేరుకుంటోంది. బుధవారం రాత్రి పౌర్ణమి ఘడియలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో, సోమవారం సాయంత్రం హఠాత్తుగా సముద్రం సుమారు వందడుగుల వెనక్కి వెళ్లింది. దీంతో, సముద్రం కింద పాచి పట్టిన రాళ్లు కనిపించాయి. అయినా, భక్తులు ఎలాంటి భయాందోళన చెందకుండా రాళ్ల మీదుగా సముద్రం వద్దకు వెళ్లారు. యథావిధిగా సముద్రంలో పుణ్యస్నానాలు చేసి స్వామి దర్శనం చేసుకున్నారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటులో రాష్ట్రం మూడో స్థానం

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోలార్ ప్లాంట్ల సామర్థ్యం 9,270 మెగావాట్లకు పెరిగింది. దీంతో సోలార్ పవర్ ఇన్‌స్టాలేషన్ సామర్థ్యంలో దేశంలోనే రాష్ట్రం మూడో స్థానంలో నిలిచింది. పవన, సౌర విద్యుత్ సహా పునరుత్పాదక విద్యుత్ ఉపయోగించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పెద్ద కంపెనీలు తమ సొంత అవసరాలకు అధిక సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటుచేసి తమకు అవసరమైన విద్యుత్‌వాడుకోగా, మిగిలినది విక్రయిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, సోలార్ ప్లాంట్ల ఏర్పాటులో రాజస్థాన్ 24,224 మెగావాట్లతో మొదటి స్థానం, గుజరాత్ 15,120 మెగావాట్లతో రెండో స్థానం, తమిళనాడు 9,270 మెగావాట్లతో మూడో స్థానంలో నిలిచాయి. అలాగే, కర్ణాటక 8,930 మెగావాట్లతో నాలుగో స్థానం, 7,500 మెగావాట్లతో మహారాష్ట్ర ఐదో స్థానంలో నిలిచాయి. గత ఏడాది తమిళనాడు 8,167 మెగావాట్లతో నాలుగో స్థానంలో ఉండడం గమనార్హం.

6 సెం.మీ వర్షానికే ఇలా... 20 సెం.మీ కురిస్తే...!

● పీఎంకే నేత రాందాస్

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో కురిసిన 6 సెం.మీ వర్షానికే పలు ప్రాంతాలు నీటమునిగాయని, మరి 20 సెం.మీ కురిస్తే జన జీవనం ప్రశ్నార్థకంగా మారుతుందని పీఎంకే వ్యవస్థాపకుడు డా.రాందాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర ప్రభుత్వం, చెన్నై కార్పొరేషన్ సంయుక్తంగా చేపట్టిన వర్షపు నీటి కాల్వల నిర్మాణం 95 శాతం పూర్తయ్యాయని, భారీ వర్షం కురిసినా నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలు గుప్పించిందన్నారు.రుతుపవనాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టామని మంత్రులు పేర్కొన్నారని, కానీ, సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన 6 సెం.మీ వర్షానికే నగరం చిన్నాభిన్నమైందన్నారు. మంత్రులు చెప్పే మాటలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని, ప్రజలే ఈ వరదల్లో తమను తాము కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రాందాస్ పేర్కొన్నారు.

విద్యుదాఘాతానికి నాలుగు పశువుల మృతి

ప్యారీస్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తాంబరం సమీపంలో విద్యుత్ తీగ తెగి నాలుగు పశువులు మృతిచెందాయి. మదురపాక్కం సమీపం మూలచ్చేరి అమ్మన్ ఆలయ వీధికి చెందిన రాణి-కాళిదాసు దంపతులు పాల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి భారీ వర్షంతో కూడిన ఈదురుగాలులకు విద్యుత్ వైరు తెగి నాలుగు పశువులపై పడడంతో మృతిచెందాయి. విద్యుత్ సిబ్బంది అక్కడకు చేరుకొని తెగిన వైరు తొలగించారు. సేలయూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గాఢాంధకారంలో ఉత్తర చెన్నై

వేళచ్చేరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాత్రి నుంచి కురిసిన వర్షాలకు వ్యాసర్పాడి, ముల్లయ్య నగర్, సత్యమూర్తి నగర్, ఎంటీకే నగర్ ప్రాంతాల్లోని వీధులు జలమయమయ్యాయి. ఈ నేపథ్యంలో, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఈ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

పిల్లల హత్యకు దారితీసిన అన్నదమ్ముల ఆస్తి తగాదాలు



మృతులు నవీన, సుగన్ (ఫైల్ ఫొటో)

వేళచ్చేరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల తగాదాల కారణంగా అక్కాతమ్ముడు దారుణ హత్యకు గురైన ఘటన సేలం జిల్లాలో చోటుచేసుకుంది. ఒరువన్‌కాడు గ్రామానికి చెందిన రాజాకు ప్లస్ టూ చదువుతున్న నవీన (17) అనే కుమార్తె, 9వ తరగతి చదువుతున్న సుగన్ (14) అనే కుమారుడున్నాడు. ఆయన ఇంటి సమీపంలో సోదరుడు ధనశేఖరన్ కూడా నివసిస్తున్నాడు. ఆస్తులకు సంబంధించి వారిద్దరి మధ్య గొడవలున్నట్టు సమాచారం. సోమవారం సాయంత్రం 6.45 గంటలకు తమ ఇంటి సమీపంలోని తోటలో నవీన, సుగన్ పూలు కోస్తున్నారు. ఆ సమయంలో హఠాత్తుగా వారి కేకలు విన్న రాజా ఇంటి నుంచి బయటకు రాగా, అక్కడ ఉన్న ధనశేఖరన్ అతడిని దుడ్డుకర్రతో కొట్టి పరారయ్యాడు. చుట్టుపక్కల వారు ఆ ప్రాంతానికి వచ్చి చూడగా నవీన, సుగన్‌ల గొంతు కోసి మృతిచెంది ఉండడం గుర్తించారు. డీఐజీ ఉమ, ఎస్పీ గౌతం గోయల్‌ను ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించిన పనమరత్తుపట్టి పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

35వ అంతస్తు నుంచి దూకి కొరియావాసి ఆత్మహత్య

వేళచ్చేరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా తిరుపోరూర్ సమీపం ఏకాట్టూరు ఓఎంఆర్ రోడ్డులో 40 అంతస్తుల అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. అందులో 35వ అంతస్తులో కొరియాకు చెందిన యాంక్యూలిమ్-సు జాంగ్‌సింగ్ దంపతులు తమ కుమారుడు సియోలిమ్ (15)తో రెండు నెలలుగా అద్దెకు ఉంటున్నారు. సియోలిమ్ ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. యాంక్యూలిమ్ మరమలైనగర్‌లోని కొరియా సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. వ్యాపార పనుల కారణంగా ఆయన గత వారం దక్షిణ కొరియా వెళ్లాడు. ఈ నేపథ్యంలో, సోమవారం వేకువజామున 3.30 గంటల ప్రాంతంలో యాంక్యూలిమ్ కుమారుడు 35వ అంతస్తు నుంచి కిందకు దూకాడు. ఆ శబ్దానికి వాచ్‌మెన్ అక్కడకు వచ్చి చూడగా, రక్తపు మడుగులో సియోలిమ్ మృతిచెంది కనిపించాడు. ఈ ఘటనపై కిలంబాక్కం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గుండెపోటుతో కండక్టర్ మృతి

వేళచ్చేరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ గుండెపోటుతో మృతిచెందాడు. ఆంధ్ర రాష్ట్రం నగరి ప్రాంతానికి చెందిన కుప్పయ్య (53) తిరుత్తణి బస్ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 10.30 గంటలకు తిరుత్తణి-కోనసముద్రం బస్సు వెళ్తుండగా, నత్తం బస్టాండ్ సమీపంలో కుప్పయ్య హఠాత్తుగా స్పృహ తప్పి పడిపోయాడు. డ్రైవర్ అతడిని వెంటనే తిరుత్తణి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై తిరుత్తణి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారం

● విద్యార్థి అరెస్ట్

వేళచ్చేరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారానికి పాల్పడిన కళాశాల విద్యార్థిని పోలీసులు అరెస్ట్ చేశారు. పులియాన్‌తోపుకు చెందిన ఓ మహిళతో పాటు తల్లి, మతిస్థిమితం లేని అక్క జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఘటన జరిగిన రోజున ఆ మహిళ విధులకు వెళ్లగా, అదే ప్రాంతానికి చెందిన ఖాలిద్ ఇంట్లో ప్రవేశించి మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పులియాంతోపు పోలీసులు కేసు నమోదుచేసి, ఖాలిద్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

'ఎమ్మెల్యేను నరుకుతాం' వీడియో చేసిన యువకుల అరెస్ట్

వేళచ్చేరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక న్యూ గుమ్మిడిపూండి పంచాయతి పరిధిలోని బాలకృష్ణాపురం ప్రాంతానికి చెందిన దీనదయాళన్ 'అన్ని హత్యలు మేమే చేస్తాము, ఎమ్మెల్యే టీజే గోవిందరాజుకు కూడా నరుకుతాం, కత్తి తీసుకురా, పెట్రోల్ బాంబ్ రెడీ చెయ్' అంటూ వీడియో పోస్టు చేశాడు. అతడితో పాటు మదన్‌కుమార్ కూడా ఉన్నాడు. వారు మద్యం మత్తులో ఈ వీడియో చేసి విడుదల చేయగా, గుమ్మిడిపూండి నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై విచారించిన గుమ్మిడిపూండి సిప్కాట్ పోలీసులు దీనదయాళన్, మదన్‌కుమార్‌లను అరెస్ట్ చేసి, ఈ వీడియో పోస్ట్ చేసి పరారీలో ఉన్న శీను కోసం గాలిస్తున్నారు.

ఆంధ్రాలో చిక్కుకున్న కాశిమేడు జాలర్లు

ప్యారీస్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశిమేడు జాలర్లు ఆంధ్ర రాష్ట్రంలో చిక్కుకుపోయారు. కాశిమేడు ఫిషింగ్ హార్బర్ నుంచి సోమవారం ఉదయం వందలాది మంది జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో కాశిమేడు ప్రాంతం నుంచి 22 పడవల్లో వెళ్లిన జాలర్లు, ఆంధ్ర రాష్ట్రంలోని పలు హార్బర్లలో చిక్కుకున్నారు. ప్రస్తుతం వారందరూ సురక్షితంగా ఉన్నారని తెలిపిన మత్స్యశాఖ అధికారులు, తీర ప్రాంతాల్లో ఉన్న పడవలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జాలర్లకు విజ్ఞప్తి చేశారు.

'టాస్మాక్' దుకాణాలకు పోటెత్తిన మందుబాబులు

ప్యారీస్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాలతో నగరం చల్లబడడంతో టాస్మాక్ దుకాణాల్లో మద్యం కోసం మందుబాబులు బారులు తీరారు. నగరానికి భారీవర్ష సూచన ప్రకటించిన నేపథ్యంలో, పాఠశాలలు, కళాశాలలకు మంగళవారం సెలవు ప్రకటించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో టాస్మాక్ దుకాణాలకు మద్యం ప్రియులు పోటెత్తారు. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయనే ప్రకటనతో, అధికంగా మద్యం కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వచేసుకొనే పనుల్లో మద్యం ప్రియులు బిజీ అయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఐటీ ఉద్యోగి మృతి

ప్యారీస్, అక్టోబరు 15: మదురైలో లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో ఐటీ ఉద్యోగి మృతిచెందాడు. తెప్పకుళం సమీపం చిన్నఅనుపాండి ప్రాంతానికి చెందిన ముత్తురామన్ కుమారుడు వీరశరవణన్ (35) అదే ప్రాంతంలోని ఓ సంస్థలో పనిచేస్తున్నాడు. వీరశరవణన్ ప్రతిరోజు ఇంటి నుంచి ఆఫీసుకు బైక్‌పై వెళ్తుంటాడు. మంగళవారం ఉదయం వీరశరవణన్ వెళ్తున్న బైక్ చింతామణి రింగ్ రోడ్డు సమీపంలోని రైస్ మిల్లు సమీపిస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ఘటనలో వీరశరవణన్ తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అవనియాపురం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదుచేసి పరారైన లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

సామ్‌సంగ్ కార్మికుల సమ్మె విరమణ

వేళచ్చేరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సామ్‌సంగ్ కార్మికులు చేపట్టిన సమ్మె విరమించుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వేతనం పెంపు, సీఐటీయూ కార్మిక సంఘం ఏర్పాటుకు అనుమతి సహా 8 డిమాండ్లతో గత నెల 9వ తేది నుంచి సామ్‌సంగ్ కార్మికులు సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. సమ్మె విరమింపజేసేందుకు మంత్రులతో కూడిన కమిటీ, సామ్‌సంగ్ ప్రతినిధులు, కార్మిక సంఘాల నేతలతో చేపట్టిన పలు విడతల చర్చలు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో, మంగళవారం కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయంలో మంత్రులతో కూడిన బృందం మళ్లీ సామ్‌సంగ్ ప్రతినిధులు, కార్మిక సంఘాలతో జరిపిన చర్చలు ఫలించాయి. సమ్మె విరమించుకుంటున్నట్లు, గురువారం నుంచి యథావిధిగా విధులకు హాజరవుతామని కార్మికులు తెలిపినట్లు ప్రభుత్వం ప్రకటించింది. సమ్మెలో పాల్గొన్న కార్మికులపై ఎటువంటి కక్షసాధింపు ధోరణులకు పాల్పడరాదని సామ్‌సంగ్ ప్రతినిధులకు సూచించినట్లు ప్రభుత్వం తెలిపింది.

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

● ఈపీఎస్ డిమాండ్

వేళచ్చేరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వరద బాధిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... నగరంలో చేపట్టిన వర్షాల ముందస్తు చర్యలపై ప్రభుత్వ శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. డీఎంకే అధికారం చేపట్టినప్పటి నుంచి వరదల నివారణ ముందస్తు చర్యలపై నివేదిక విడుదల చేయడంతో పాటు వరద నీటిని అడ్డుకొనేలా ఏర్పాటుచేసిన కమిటీ చేసిన సిఫారసులు ఏ మేరకు ప్రభుత్వం అమలుచేసిందని ప్రశ్నించారు.



రజని, అనిరుధ్, జ్ఞానవేల్‌ను అభినందిస్తున్న మేకర్స్

'వేట్టయన్' కలెక్షన్లు 4 రోజుల్లో రూ.240 కోట్లు

సూపర్‌స్టార్ రజనీకాంత్ - దర్శకుడు టీజే జ్ఞానవేల్ కాంబినేషన్‌లో రూపొందిన 'వేట్టయన్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా నాలుగు రోజుల్లో రూ.240 కోట్లకు పైగా వసూలు చేసినట్టు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా హీరో రజనీకాంత్, దర్శకుడు జ్ఞానవేల్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్రన్‌లను మేకర్స్ సోమవారం రాత్రి ప్రత్యేకంగా అభినందించారు. బడా నిర్మాత సుభాస్కరన్ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించగా, దసరా పండుగ సందర్భంగా ఈ నెల 10న ప్రపంచ వ్యాప్తంగా తమిళం, తెలుగు, హిందీ భాషల్లో విడుదల చేశారు. పోలీసుల నకిలీ ఎన్‌కౌంటర్, నీట్ పరీక్ష, కోచింగ్ సెంటర్ల అరాచకాలను దర్శకుడు ఎత్తి చూపారు. సినిమాలో కంటెంట్‌కి అభిమానులు, ప్రేక్షకులు బాగా కనెక్ట్ కావడంతో విశేషాదరణ లభించింది. ఇతర పాత్రల్లో బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్, ఫహద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్, తుషార విజయన్, రితికా సింగ్ తదితరులు నటించారు. రజనీ నటించిన 'జైలర్' చిత్రం ఏకంగా రూ.500 కోట్ల మేరకు వసూలు చేసింది. 'వేట్టయన్' 4 రోజుల్లో రూ.240 కోట్లు వసూలు చేసింది. దీపావళి వరకు పెద్ద హీరోల చిత్రాలు లేకపోవడంతో 'వేట్టయన్ - ది హంటర్' హవా కొనసాగనుంది. దీంతో ఈ మూవీ కూడా 'జైలర్' కలెక్షన్లను బీట్ చేస్తుందా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

ఆర్జే బాలాజి దర్శకత్వంలో 'సూర్య-45'

● ఏఆర్ రెహ్మాన్ సంగీతం

ఎప్పటికపుడు వైవిధ్య భరితమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించే హీరో సూర్య మరోమారు అలాంటి కాంబినేషన్‌కే మొగ్గు చూపారు. తమిళ చిత్రసీమలో హాస్య నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని దర్శకుడిగా మారిన ఆర్జే బాలాజీ దర్శకత్వంలో నటించేందుకు సిద్ధమయ్యారు. సూర్య - ఆర్జే బాలాజీ కాంబినేషన్‌లో 'సూర్య-45' మూవీ రూపుదిద్దుకోనుంది. ఏఆర్ రెహ్మాన్ సంగీతం సమకూరుస్తుండగా డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్.ప్రకాష్ బాబు, ఎస్.ఆర్.ప్రభు కలిసి నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుపై మేకర్స్ సోమవారం అధికారికంగా ప్రకటించారు. రేడియో జాకీ నుంచి నటుడిగా అవతారమెత్తిన ఆర్జే బాలాజీ.. 'మూక్కుత్తి అమ్మన్' చిత్రంతో దర్శకుడిగా మారారు. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ సాధించింది. ఆ తర్వాత సత్యరాజ్ - ఊర్వశి ప్రధాన పాత్రల్లో 'వీట్ల విశేషం' సినిమా రూపొందించారు. ఇపుడు ముచ్చటగా మూడో చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా తెలియజేస్తూ తనకు అవకాశం ఇచ్చిన హీరో సూర్యకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం ఆర్జే బాలాజీ యేడాదికిపైగా కసరత్తు చేసినట్టు సమాచారం. ఫాంటసీ యాక్షన్ జోనర్‌లో తెరకెక్కించనున్నారు. ఇప్పటికే లొకేషన్లను ఎంపిక చేయగా, నవంబరులో సెట్స్‌పైకి తీసుకెళ్ళి 2025లో విడుదల చేయాలని భావిస్తున్నారు. ఇందులో నటించే నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణులు వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.



సూర్య, ఆర్జే బాలాజీ, రెహ్మాన్

నిత్యామేనన్‌కు ధనుష్ మరో ఛాన్స్...



ఇటీవలే జాతీయ అవార్డు అందుకున్న హీరోయిన్ నిత్యామేనన్ తమిళంలో మరో మారు అవకాశాన్ని దక్కించుకున్నారు. దర్శక హీరో ధనుష్ తెరకెక్కించే 'ఇడ్లీకడై' సినిమాలో ఈ మలయాళీ భామను ఎంపిక చేశారు. డాన్ పిక్చర్స్ పతాకంపై ఆకాష్ భాస్కరన్, రెడ్ జెయింట్ మూవీస్, వాండర్‌బార్ సహకారంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రాజ్‌కిరణ్, సత్యరాజ్, అరుణ్ విజయ్, షాలిని పాండే ముఖ్య పాత్రలను పోషిస్తుండగా, హీరోయిన్‌గా నిత్యామేనన్‌ను ఎంపిక చేసినట్టు సోమవారం అధికారికంగా ప్రకటించారు. గతంలో వీరిద్దరు కలిసి సూపర్ హిట్ మూవీ 'తిరుచిత్రాంబలం' చిత్రంలో నటించిన విషయం తెల్సిందే. ఈ మూవీలో నటనకుగాను నిత్యామేనన్‌కు జాతీయ అవార్డు కూడా వరించింది. ఈ నేపథ్యంలో తాను దర్శకత్వం వహించే నాలుగో చిత్రం, హీరోగా నటించే 52వ చిత్రం 'ఇడ్లీకడై'లో నిత్యామేనన్‌కు ధనుష్ ఛాన్సిచ్చారు.

రెండు దశాబ్దాల తర్వాత
హిట్ కాంబో రిపీట్?

సినిమాల్లో కొన్ని కాంబినేషన్లు సూపర్ డూపర్ హిట్స్‌గా ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. అలాంటి వాటిలో ప్రభుదేవా - వడివేలు కాంబినేషన్ ఒకటి. ఈ కాంబో మరోమారు రిపీట్ కానుంది. సుమారుగా రెండు దశాబ్దాల తర్వాత వీరిద్దరు వెండి తెరపై ఆలరించనున్నారు. ప్రభుదేవా హీరోగా నటించిన 'కాదలన్', 'రాసయ్య', 'మిస్టర్ రోమియో', 'లవ్ బర్డ్స్', 'మనదై తిరుడివిట్టాయ్' వంటి అనేక చిత్రాల్లో వడివేలు నటించారు. కాగా వారిద్దరూ 20 యేళ్ళ తర్వాత కలిసి నటించనున్నారు. 'మహా నడిగన్', 'ఇంగ్లీష్‌కారన్' వంటి అనేక చిత్రాలకు రూపొందించిన శక్తి చిదంబరం ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు.

చిత్రజ్యోతి



వడివేలు - ప్రభుదేవా

వరదలా ప్రవహించిన వర్షపు నీరు



వరద నీటితో నిండిన రోడ్లపై వెళుతున్న అంబులెన్స్

ఇంటికి సరుకులు తీసుకెళ్లాలంటే తప్పదు మరి...!





● మునిగిన 300 ప్రాంతాలు

● కొరట్టూరులో వెయ్యి ఇళ్లలోకి ప్రవేశించిన జలాలు

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వర్షంతో నగరంలోని 300లకు పైగా ప్రాంతాలో నీరు చేరింది. మైలాపూరు, రాయపేట, వేళచ్చేరి, వాషర్‌మెన్‌పేట, రాయపురం, కొడుంగైయూరు, మాధవరం, పెరంబూరు, ముగప్పేరు, తిరుమంగళం తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ఆయా ప్రాంతాల్లోని రహదారులపై వర్షపునీరు ప్రవహించింది. విల్లివాక్కం, అంబత్తూరులోని పల్ల ప్రాంతాల్లో నీరు చేరింది. ఒట్టేరి, అయనవరం, కున్నూరు హైరోడ్డు, సిడ్కో నగర్, నాదముని, తిరుమంగళం రోడ్డు, కొరట్టూర నుండి అంబత్తూరు ఓటీ బస్టాండు వరకు రహదారికి ఇరువైపులా రెండడుగుల మేర వర్షపునీరు ప్రవహించింది. కొరట్టూరు గృహనిర్మాణ సంస్థ క్వార్టర్స్ వద్ద వెయ్యికి పైగా ఇళ్లలోకి వర్షపునీరు ప్రవేశించింది. ఇదే విధంగా అంబత్తూరు పట్టరైవాక్కం రోడ్డు, డీడీపీ రోడ్డు, కళ్లికుప్పం, మాదనంకుప్పం, టీచర్స్ కాలనీ, పుదూరు, భాను నగర్, జ్ఞానమూర్తి నగర్, పట్టరైవాక్కం, అంబత్తూరు పారిశ్రామికవాడ ఫ్యాక్టరీలు, ఇళ్లలోనూ వర్షపునీరు చేరింది.

వేళచ్చేరిలో.. : వేళచ్చేరి రైల్వేస్టేషన్ వెనుక తరమణి అంబేద్కర్ లా విశ్వవిద్యాలయానికి వెళ్లే వందడుగుల రహదారికిరువైపులా ఉన్న వాననీటి కాల్వల్లో మోకాలిలోతున వర్షపునీరు మురుగునీరు కలిసి ప్రవహించాయి. వేళచ్చేరి, నెహ్రూనగర్, కామరాజర్ వీధి తదితర ప్రాంతాల్లో మోకాలి లోతున వర్షపు నీరు వరదలా ప్రవహించాయి.

సబ్‌వేల మూత...: కుండపోత వర్షాల కారణంగా నగరంలోని ఐదు ప్రధాన సబ్‌వేలను అధికారులు మూసివేశారు. నాలుగడుగుల మేర వర్షపునీరు చేరటంతో పెరంబూరు రైల్వే సబ్‌వే, గణేశపురం, సుందరం పాయింట్, దురైసామి, మేడ్లీ సబ్‌వేలను మూసివేశారు.

కోవైలో మంత్రి సెంథిల్ బాలాజి పర్యటన

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ వరద బాధిత ప్రాంతాల్లో మంత్రి సెంథిల్ బాలాజి మంగళవారం పర్యటించారు. కోవైలో కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై కూడా వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో, కోవై నంజుండాపురం కదిరవన్ రోడ్డులోని ముంపునకు గురైన ప్రాంతాలను మంత్రి సెంథిల్ బాలాజి పరిశీలించారు. ఆ ప్రాంతాల్లో నివారణ చర్యలు, కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని మంత్రి పరిశీలించారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ క్రాంతి కుమార్ భాటి, కార్పొరేషన్ కమిషనర్ శివగురు ప్రభాకరన్, మేయర్ రంగనాయకి, ఎస్పీ గణపతి రాజ్‌కుమార్, డిప్యూటీ మేయర్ వెట్రిసెల్వన్, డీఎంకే జిల్లా కార్యదర్శులు ఎన్.కార్తీక్, టీఆర్ రవి, దళపతి మురుగేశన్ తదితరులున్నారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సెంథిల్ బాలాజి

చెన్నై పరిధిలో 300 సహాయక కేంద్రాలు

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో, పరిసర జిల్లాల్లో బుధవారం భారీగా వర్షాలు కురిసే అవకాశాలుండటంతో పల్లపు ప్రాంతాల్లో నివసిస్తున్నవారికి అన్ని సదుపాయాలు కల్పించేందుకు 300 సహాయక కేంద్రాలు సిద్ధం చేసినట్లు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తెలిపారు. సోమవారం రాత్రి నుంచి ఆయన నగరంలో వర్షబాధిత ప్రాంతాల్లో పర్యటించారు. వాననీటి తొలగింపు పనులను కూడా తనిఖీ చేశారు. మంగళవారం ఉదయం ఎళిలగమ్ భవనంలో మీడియాతో మాట్లాడుతూ నగరంలో చోళింగనల్లూరు, పెరంబూరు, తేనాంపేట, మనలి, తండయార్‌పేట తదితర ప్రాంతాల్లో వర్షపునీరు ఎక్కువగా ప్రవహించిందని, సకాలంలో కార్పొరేషన్ అధికారులు మోటార్లతో నీటిని తొలగించడంతో పరిస్థితి చక్కబడిందన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన ఆహారం సరఫరా చేయనున్నామని ఆయన చెప్పారు.



ఎళిలగమ్ భవనంలో అత్యవసర కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉదయనిధి



వర్షపు నీరు తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి



'తడవబాకరా నాయనా.. తల తడిస్తే పడిసెం జేస్తాది' అని వానలో ఆడే పిలకాయల్ని అమ్మ మందలిస్తూ ఉంటుంది. వకుళమాత కోపం గుర్తుకొచ్చిందేమో మరి.. మంగళవారం సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ ఊరేగింపు కోసం బయట కొచ్చిన స్వామి ఘటాటోపం కిందకి చేరుకున్నాడు. తల తడిస్తే పడిసెం మాకు మాత్రం పట్టదా అని ఏనుగులు మహాలక్ష్మి, పద్మజ కూడా పందిరి కిందకు చేరుకున్నాయి, తడవకుండా.

- తిరుమల,ఆంధ్రజ్యోతి



అర గంట నిలిచి కురిస్తే చాలు.. మాలాడగుండం దూకి పారుతుంది. కపిలతీర్థం కత చెప్పనే అవసరం లేదు. హోరెత్తుతుంది. రెండు రోజులుగా చిటుకూ పటుకూ మంటూనే ఉన్నా ఉలుకూపలుకూ లేకుండా ఉన్న మాలాడగుండంలో మంగళవారం సాయంత్రానికి సన్నని ధర మొదలైంది. చూరునీళ్లు కారినట్టుగా కనిపిస్తున్నా.. ఇదేవాన రాత్రికి కురిస్తే మాత్రం తెల్లారేసరికి ఉరకలెత్తి తిరుపతి నగరానికి కనువిందు చేస్తుంది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి



నగరంలో సోమవారం రాత్రి నుంచి ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులతో కూడిన భారీవర్షం కురిసింది. ఈ క్రమంలో, క్రోంపేట సమీపంలోని రైలుపట్టాలపై చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో తాంబరం నుంచి చెన్నై బీచ్‌కు వెళ్తున్న సబర్బన్ రైలును డ్రైవర్ నిలిపివేశాడు. సమాచారం అందుకున్న క్రోంపేట పోలీసులు, రైల్వే కార్మికులు అక్కడకు చేరుకొని చెట్టు కొమ్మలు తొలగించారు.

- పెరంబూరు, ఆంధ్రజ్యోతి



దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఇంట్లో వరద నీరు చేరింది. నగరంలో సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వేళచ్చేరిలోని ఏజీఎస్ నగర్‌లో భారీగా వరద నీరు చేరడంతో ఆ ప్రాంత ప్రజలను కార్పొరేషన్ సిబ్బంది పడవల్లో తీసుకువచ్చారు. ఈ క్రమంలో, గోపాలపురంలోని కరుణానిధి ఇంట్లో వరద నీరు ప్రవేశించింది. వరద నీరు ఇంట్లో ప్రవేశించకుండా ఇసుక బస్తాలు వేసినా, బస్తాలను దాటి వరద నీరు ఇంట్లో ప్రవేశించింది.

- పెరంబూరు, ఆంధ్రజ్యోతి

STREET FOOD



భలే భలే బజ్జీలు





ఇక్కడ దొరికే బజ్జీలు:


మిర్చి బజ్జీ, టమోటా, క్యాప్సికం, బీరకాయ, అరటికాయ, వంకాయ, ఉర్లగడ్డ, సీమవంకాయి, గెనిసిగెడ్డ, సొరకాయ, యాపిల్, జామ, పైనాపిల్, మామిడి కాయ.

ప్రత్యేకత:
బజ్జీలకు సన్‌ఫ్లవర్ ఆయిల్ వాడుతారు. ఒక రోజు వాడిన నూనె మిగిలినా మరుసటి రోజుకి వాడరు.

ఎన్ని ఛాట్‌లు వచ్చినా మన బజ్జీని కొట్టే మొనగాడు ఫుడ్ లేదు. మరీ కాస్త చినుకు రాలి చల్లబడితే మనసు బజ్జీ మీదకు పోతుంది. మిర్చి బజ్జీ, అరటికాయ బజ్జీ, ఉర్లగడ్డ బజ్జీ.. మనకు తెలుసుగానీ 15 రకాల బజ్జీలు దొరికే ఒక చోటు తిరుపతిలో ఉంది. రాములవారి ఉత్తర మాడవీధిలో ఈ బజ్జీల బండి దగ్గర సాయంత్ర సమయాల్లో జనం కిటకిటలాడుతూ కనిపిస్తారు. మరిగే నూనెలోంచి కాలేకాలే బజ్జీలు ప్లేట్‌లో పెట్టి.. ఎండుమిరపకాయలు, అలసందలు, ధనియాలు, చెనిక్కాయ పప్పులతో కూడిన మసాలాను ఆ బజ్జీలలో కూరి ఇస్తారు. ఫైనల్ టచ్‌గా నిమ్మ దబ్బ పిండుతారు. సురేంద్ర ఆరేళ్లుగా ఈ బండి నిర్వహిస్తున్నారు. - తిరుపతి (జీవకోన)

బండి సమయం: సాయంత్రం 4 నుంచి రాత్రి 9 దాకా

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి పట్ల చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల తీరుపై సమాచారం తెప్పించుకుంటున్న ఆయన జిల్లాలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దడం మీద దృష్టి పెట్టినట్టు చెబుతున్నారు.



తిరుపతి
ఆంధ్రజ్యోతి

తీరు బాలేదు

తమ్ముళ్లూ!

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ పరిస్థితిపై చంద్రబాబు అసంతృప్తి
- చక్కదిద్దే పనిలో అధినేత

గత ఐదేళ్లూ ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా వైసీపీ నేతలను మొక్కవోని స్థైర్యంతో ఎదుర్కొన్న టీడీపీ శ్రేణులు ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతో పెద్ద ఎత్తున సంబరపడ్డాయి. అయితే వంద రోజులు కూడా గడవక మునుపే శ్రేణులు నిరుత్సాహానికి లోనయ్యాయి. పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వం వచ్చీరాగానే సంపాదనపై దృష్టి మళ్ళించారని, పార్టీ పటిష్టతను వదిలేసి దానికే తొలి ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. నిఘా వర్గాలతో పాటు పార్టీ పరంగానూ వేర్వేరు మార్గాల్లో అందిన సమాచారం ఆధారంగా జిల్లాలో ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, ఇంఛార్జుల పనితీరును, వారి వ్యవహార శైలిని అధినేత చంద్రబాబు బేరీజు వేస్తున్నట్టు సమాచారం. ఎక్కువమంది ఎమ్మెల్యేలు పార్టీకోసం కష్టపడిన నాయకులను పట్టించుకోకుండా, తమకు అనుకూలురైన ఒకరిద్దరికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని, వారు చెప్పినట్టే వినాలని మండల స్థాయిలో అధికారులకు ఆదేశాలిస్తున్నారని అధినేతకు ఫిర్యాదులు అందాయి. ఇక శాసనసభలో ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కొందరు ఎమ్మెల్యేలు ఇసుక మీద పడ్డారు. ప్రభుత్వ ఇసుక విధానం ఖరారు కాకముందే డంపుల్లో నిల్వవున్న ఇసుకను దౌర్జన్యంగా తెగనమ్మేసుకున్నారని అంటున్నారు. రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు. వైసీపీ నేతలు చేసిన భూ కబ్జా వ్యవహారాల్లో తలదూర్చి ఫిఫ్టీ:ఫిఫ్టీ పద్ధతిలో సర్దుడు బేరాలు మొదలు పెట్టేశారనే ఆరోపణలు ఉన్నాయి. తనకందుతున్న ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుంటున్న అధినేత ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు, ఇంఛార్జుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. శ్రేణులను విస్మరించడాన్ని ఆయన తీవ్రంగా పరిగణిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ ఎమ్మెల్యేలు లేని మూడు నియోజకవర్గాలకు గానూ రెండు చోట్ల ఇంఛార్జుల పనితీరుపై కూడా అధినేత అసహనంగా వున్నట్టు ఆ వర్గాలు చెబుతున్నాయి. ఓ నియోజకవర్గంలో ఇంఛార్జి పార్టీని గాలికొదిలేసినట్టు వ్యవహరిస్తుండడం, మరో చోట క్యాడర్ వాహనాల్లో అమరావతికి తరలివెళ్ళి ఇంఛార్జిపై ఫిర్యాదులు చేస్తుండడం పట్ల చంద్రబాబు సీరియస్‌గా వున్నట్టు సమాచారం.

సమన్వయపరిచే నాయకత్వంపై దృష్టి

ఉమ్మడి జిల్లాకు సంబంధించి పార్టీ పార్లమెంటు కమిటీల పేరిట మూడు ముక్కలైన సంగతి తెలిసిందే.అందులో రెండు కమిటీలకు సంబంధించి సమర్థ నాయకత్వం లేదని అధినేత భావిస్తున్నట్టు పార్టీ వర్గాల కథనం.కనీసం జిల్లాస్థాయిలో అభివృద్ధి ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళేందుకు, నిధుల కోసం ప్రయత్నించేందుకు కూడా తగిన నాయకత్వం లేకపోవడాన్ని అధినేత గ్రహించినట్టు చెబుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచీ ఎవరికీ మంత్రి పదవి కేటాయించకపోవడం కూడా ఈ పరిస్థితికి కారణం అంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దాల్సిన సీనియర్ నేతలు ఎవరి కారణాలతో వారు అసంతృప్తితో మిన్నకుండిపోయినట్టు అధినేత గుర్తించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వారిని చురుగ్గా పనిచేయించే దిశగా అధినేత దృష్టిసారించినట్టు తెలిసింది. అందులో భాగంగా ఇటీవల తిరుమలకు వచ్చిన చంద్రబాబు మాజీ మంత్రి అమరనాథరెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడినట్టు సమాచారం. జిల్లా అభివృద్ధి ప్రతిపాదనలతో పాటు పార్టీ పరంగానూ చర్చించినట్టు తెలిసింది. మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు గానూ అమరనాథరెడ్డిని విజయవాడ వచ్చి తనను కలవాల్సిందిగా అధినేత సూచించినట్టు సమాచారం. దీంతో ఆయనకు ఉమ్మడి జిల్లా పార్టీ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తారా లేక ఆయనతో పాటు మరికొందరు సీనియర్, ముఖ్యనేతలను కూడా పిలిపించి ఉమ్మడిగా బాధ్యతలు అప్పజెబుతారా అన్న ఊహాగానాలు పార్టీ శ్రేణుల్లో వెలువడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై మంత్రివర్గంలో చోటు లభించకపోవడంతో పలమనేరు నియోజకవర్గానికే పరిమితమైన అమరనాథరెడ్డి అధినేతను ఇంతవరకూ ఒంటరిగా కలసి మాట్లాడలేదు. ఈ నేపథ్యంలో చంద్రబాబు, అమరనాథరెడ్డి మధ్య జరిగిన సంభాషణ రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. మొత్తం మీద అధినేత దృష్టి సారించడంతో ఉమ్మడి జిల్లాలో పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులకు, కార్యకర్తలకు మేలు జరుగుతుందన్న ఆశాభావం మాత్రం ఆ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

పురుషులు మాత్రమే పాల్గొనే ఆలయ వేడుకలు



పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా వత్తలగుండు సమీపం తరుమత్తుపట్టికోటలో కరుప్పన్‌స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయ వేడుకల్లో ఒకరోజు పురుషులు మాత్రమే పాల్గొని స్వామికి నైవేద్యం సమర్పించి, మాంసాహార విందులో పాల్గొంటారు. కోరిక తీరిన భక్తులు మొక్కులుగా మేకలు, పొట్టేళ్లను ఆలయానికి కానుకగా అందజేస్తుంటారు. వేడుకల్లో భాగంగా ఆ జంతువులను స్వామివారికి బలిచ్చి, వాటి మాంసంతో వంట చేసి విందు చేస్తారు. సోమవారం రాత్రి జరిగిన ఈ వేడుకల్లో వత్తలగుండుతో పాటు సమీపంలోని గ్రామాల నుంచి వందల సంఖ్యలో పురుషులు పాల్గొన్నారు.

స్వర్ణముఖికి పెనుముప్పు



దొరువుకట్ట వద్ద గండిపడ్డ పొర్లుకట్ట

- దెబ్బతిన్న పొర్లుకట్ట.. ప్రమాదం జరిగితే నాలుగు గ్రామాలు గల్లంతే

కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి పొర్లుకట్టలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో పెనుముప్పుగా మారింది. కోట మండలం దొరువుకట్ట, పుచ్చలపల్లి గ్రామాల సమీపంలో స్వర్ణముఖి పొర్లుకట్టలు దెబ్బతిన్నాయి. గతేడాది మీచౌంగ్ తుఫాన్ కారణంగా స్వర్ణముఖి నది వరదనీరు ఉగ్రరూపం దాల్చడంతో కుడి, ఎడమ పొర్లుకట్టలు కోతకు గురవడంతో పాటు అక్కడక్కడ గండ్లుపడ్డాయి. అయినా, అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎలాంటి మరమ్మతులు చేయలేదు. తాత్కాలికంగా పనులు చేపట్టడానికీ చొరవ చూపలేదు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి పూర్తిస్థాయిలో వరదనీరు వస్తే.. దెబ్బతిన్న పొర్లుకట్టకు పెనుముప్పు వాటిల్లే అవకాశం ఉంది. కోతకు గురైన, గండ్లుపడ్డ పొర్లుకట్టలు తెగితే అల్లంపాడు, దైవాలదిబ్బ, దొరువుకట్ట, పుచ్చలపల్లి గ్రామాలు గల్లంతయ్యే ప్రమాదం ఉంది. దీంతో స్థానికంగా ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



బంతిపూలతోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శైలజ

వర్షాలకు పంటను కాపాడుకోండిలా..

ప్రస్తుత వర్షాలకు రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే నష్టం వాటిల్లదంటున్నారు మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్, ఉద్యాన అధికారి శైలజ. ఈమేరకు రైతులకు కొన్ని సూచనలు చేశారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

వరి: మొదటి, రెండో దశల్లో వర్షపు నీరు నిల్వ ఉంటే కాలువ ద్వారా బయటకు పారించాలి. కోత దశలో ఎక్కువ రోజులు పంట నీటిలో ఉంటే విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉంది. దీని నివారణకు ఉప్పు ద్రావణం పిచికారి చేయాలి. వర్షంతో దెబ్బతిన్న పంట త్వరగా కోలుకోవాలంటే అదనంగా నత్రజని సంబంధిత ఎరువులను పిచికారి చేయాలి.

పూలతోటలు: మొక్కలపై 13:0:45 (నీటిలో కరిగే ఎరువు మల్టికే)ను గ్రాము, లేదా 2 గ్రాముల యూరియాను లీటరు నీటికి కలిపి 2, 3 సార్లు వారం రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. కోతకు సిద్ధంగా ఉన్న పువ్వులను వీలైనంత త్వరగా కోసుకోవాలి. ఆకుమచ్చ తెలుగు నివారణకు ప్రోపికొనజోల్ 1 మిల్లీ లేదా, ఆజాక్సీస్ట్రోబిన్ మిల్లీగ్రాములను లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. తోటల్లో నిలువ ఉన్న అదనపు నీటిని పొలం చుట్టూ కాలువలు తీసి బయటకు పంపాలి. మొక్కలు బలంగా పెరగడానికి పోషకాలు అందించాలి. లేత తోటల్లో చనిపోయిన మొక్కలను తీసి తిరిగి నాటుకోవాలి.

ఉద్యాన పంటలు: వర్షాల వల్ల బంక నేలలో నీరు నిలిచిపోతుంది. నీరు ఎక్కువ నిల్వ లేకుండా వెంటనే బయటకు పంపించే మార్గం చూడాలి. భారీ వర్షాలకు 33 శాతం పైన నష్టం వాటిల్లితే కూరగాయలు, పూలతోటలకు 2.50 ఎకరాకు రూ.17వేలు నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది. మామిడి తోటలకు రెండున్నర ఎకరాలకు రూ.22500 చెల్లిస్తుంది.

కూరగాయల తోటలు: వర్షానికి పడిపోయిన మొక్కలను నిలబెట్టి మొదలు దగ్గర మట్టిని ఎగదోయాలి. మొక్క పెరుగుదల దశలో ఉంటే 13:0:45 (నీటిలో కరిగే మల్టికే) 2 గ్రాములు లేదా 2 గ్రాముల యూరియా ద్రావణాన్ని 2, 3 సార్లు మొక్క తడిసేలా వారం వ్యవధిలో పిచికారి చేయాలి. తెగుళ్ల ఉధృతి నేపథ్యంలో సాఫ్ 2.5 గ్రాములు, లేదా మాంకోజెట్ 2.5 గ్రాములు, జిగురు 0.5 ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. వేరుకుళ్లు ఆశించిన నేలల్లో కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండజిమ్ గ్రాము లీటరుకు కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలి.

వేరుశనగపంటలో జాగ్రత్తలిలా..

తిరుపతి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల నేపథ్యంలో వేరుశనగ రైతులు నష్టనివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ జాన్ వివరించారు. వివిధ దశల్లో ఉన్న వేరుశనగ పంటను కాపాడుకోవడంపై సూచనలు చేశారు. ఆ ప్రకారం.. వేరుశనగ విత్తనం వేసి 2-3 రోజుల సమయంలో ఉన్నప్పుడు నీటమునిగితే మొలకశాతం తగ్గుతుంది. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని బయటకు తీయాలి. ఈ దిశగా బోదెలు ఏర్పాటు చేసుకోవాలి. గింజ గట్టిపడే దశనుంచి చెట్టు పీకే వరకు.. నిద్రావస్థ కలిగిన రకాలలో పంటనష్టం తక్కువగా ఉంటుంది. నిద్రావస్థ లేనటువంటి రకాలు నీటమునిగితే గింజ మొలక వచ్చి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుంది చెట్టు పీకే దశలో ఉన్నట్లయితే చెట్ల మొదళ్లని నిటారుగా నిలబెట్టాలి. దీనివల్ల వర్షపునీరు కాయల మీద నిలబడదు. దీంతో కాయలోని గింజలు మొలకెత్తకుండా నివారించొచ్చు. పూర్తిగా ఆరని పంటని కుప్పలుగా వేసేటప్పుడు పీకిన వేరుశనగచెట్లపై టార్పాలిన్ పట్టలు కప్పుకోవాలి. కల్లాలపై ఉన్న నూర్పిడి చేసిన కాయలు వర్షానికి తడవకుండా చూసుకోవాలి.